సాక్షి పల్నాడు

ఆదివారం । 3 । మార్చి । 2024



బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలో మార్చి 6న నిర్వహించనున్న బాలోత్సవం బ్రోచర్‌ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శనివారం ఆవిష్కరించారు. ఎంఈఓ పాల్గొన్నారు.



శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

అమరావతి : అమరేశ్వరాలయంలో ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం అధికారులు పరిశీలించారు.

శేషవాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి: గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 82.63 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో సామాజిక భద్రత వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ శరవేగంగా జరుగుతుంది. రెండోరోజు శనివారం సాయంత్రం 6.15గంటలకు 82.63శాతం పంపిణీ చేశారు. మొత్తం 2,83,119 మందికి పంపిణీ చేయాల్సివుండగా 2,33,942మందికి అందజేశారు. వీరికి రూ.69,89,59,500లు పంపిణీ చేశారు. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఇంటింటికి వెళ్లి పంపిణీలో పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ-4 టాపర్లతో ఫొటోలు దిగండి

ఉపాధ్యాయులకు డీఈఓ సూచన



ప్రత్తిపాడు: ఎఫ్‌ఏ-4 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు సెల్ఫీ లేదా ఫొటో దిగాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సూచించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం డీఈఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు టోఫెల్ విద్యాబోధన ఎలా జరుగుతుందో పరిశీలించి, మరింత మెరుగ్గా బోధించేందుకు తీసుకోవలసిన చర్యలను ఉపాధ్యాయులకు సూచించారు. ఎఫ్‌ఏ-4 పరీక్షలలో తరగతి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. వారితో ఫొటోలు దిగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిలాలోని ఉపాధ్యాయులంతా ఎఫ్‌ఏ 4 ప్రశ్న పత్రాలు విద్యార్థులకు అందించి, తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులతో సెల్ఫీ లేదా ఫొటో దిగాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల మార్కులను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.

శివరాత్రికి మల్లయ్యగట్టుకు లాంచీ సర్వీసులు

విజయపురిసౌత్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి(మల్లయ్య గట్టు) ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక లాంచీ సర్వీసులను నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ శివారెడ్డి తెలిపారు. శనివారం విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8న అనుపు నుంచి ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఏలేశ్వర స్వామి గట్టుకు లాంచీ సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150గా టికెట్ ధర ఉంటుందన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను ఉచితంగా అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. అనుపులో ప్రసిద్ధి గాంచిన రంగనాథ స్వామిని దర్శించుకొని ఏలేశ్వరస్వామి గట్టుకు భక్తులు వెళ్లడం ఆనవాయితీగా జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 7,8,9 తేదీలలో జరిగే సాగరమాత పుణ్యక్షేత్రం మహోత్సవాల సందర్భంగా స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు ప్రత్యేక లాంచీ సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు.

తొలి తరం అక్షర కాంతులు

సంచార జాతుల గుడారాల్లో నేడు అక్షర కాంతులు వెదజల్లుతున్నాయి. వారి కుటుంబాల నుంచి తొలి తరం అభ్యాసకులు తయారవుతున్నారు. తరతరాల తమ నిరక్షరాస్యతను పారదోలుతున్నారు. నవోదయాన్ని సృష్టిస్తున్నారు. ఇదంతా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యావిప్లవం వల్లే.. అమ్మఒడితో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సకల విద్యా సౌకర్యాలు ఎందరో సంచార జాతుల నిరుపేద చిన్నారులు బడిబాట పట్టేలా చేసింది. బడి అంటే ఆమడ దూరం పరిగెత్తే ఆయా జాతుల్లో కదలిక తెచ్చింది. వారిలో బతుకుపై, భవిష్యత్తుపై ఆశలు చిగురింపచేసేలా చేసింది.

- ప్రభుత్వ చేపట్టిన విద్యా సంస్కరణలు, అమ్మఒడితో రగిలిన చైతన్యం
- సంచార జాతుల నుంచి తొలితరం అభ్యాసకులు తయారవుతున్న వైనం
- తొట్టతొలిగా దర్జాగా పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులు
- మురిసిపోతున్న తల్లిదండ్రులు

సంచార జాతుల్లో నవోదయం



ఒప్పిచర్లలో తమ ఇళ్ల ముందు హోంవర్క్ చేసుకుంటున్న సంచార జాతుల చిన్నారులు

కారెంపూడి: పల్నాడు జిల్లా కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల గురజాల రోడ్డు పక్కన, అలాగే కారెంపూడి వీరుల గుడి పరిసరాలలో, పోతురాజు గుట్టలో గుడారాలు వేసుకుని బేడ బుడగ జంగాలవారు నివసిస్తున్నారు. ఒప్పిచర్ల కాష్టాల గడ్డలో బుడబుక్కలవాళ్లు నివసిస్తున్నారు. వీరంతా దాదాపు 150 కుటుంబాల దాకా ఉంటారు. వీరిలో పోతురాజు గుట్టలో 60 ఇల్లు దాకా స్థిరనివాసరం ఏర్పాటు చేసుకుని పిల్లలను చదివించుకుంటూ ముందడుగు వేస్తున్నారు. నేడు ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యావిప్లవం తర్వాత మిగిలిన సంచార జాతుల పిల్లలు కూడా చక్కగా బడికెళ్లి చదువుకుంటున్నారు. ఈ దృశ్యాలు చాలా మనోహరంగా ఉన్నాయి.

అమ్మ ఒడితో బడిబాట..

అందరిలానే తమ పిల్లలను కూడా టిప్‌టాప్‌గా బడికి పంపుతూ తల్లులు మురిసిపోతున్నారు. స్వాతంత్ర్యానంతరం ఇన్నాళ్లకు వారి బతుకుల్లో అక్షర వెలుగులు తొంగి చూస్తున్నాయి. నిజంగా ఇదొక అదృష్టంగా వారు భావిస్తున్నారు. అమ్మఒడి పథకం అమ్మల హృదయాలను బలంగా తాకింది. బడికెళ్లే ప్రతి చిన్నారికి నగదు ప్రోత్సాహకం అందుతుండడంతో వారిని పనులకు పంపకుండా బడులకు పంపేందుకు తల్లులు సిద్ధపడుతున్నారు. ఇలా జగనన్న పాలనలో కొత్తతరం అభ్యాసకులు తయారు అవుతుండడం చాలా గొప్ప విశేషంగా కన్పిస్తోంది.

చెప్పలేని ఆనందంగా ఉంది..



నాకిద్దరు పిల్లలు. నేను, మా వాళ్లు ఏనాడు బడికెళ్లి చదువుకోలేదు. ఆ ఆలోచన కూడా ఎన్నడూ రాలేదు. ఇప్పుడు నా కుమారుడు అభినందన్ ఒప్పిచర్ల గ్రామంలోని రోడ్డు జంక్షన్ పాఠశాలలో నాలుగవ తరగతి చదువు తున్నాడు. నాలుగేళ్లుగా అమ్మఒడి వస్తోంది. బాగా చదువు కుంటున్నాడు. వాడు బడికి శుభ్రంగా వెళ్తుంటే చెప్పలేని ఆనందంగా ఉంది. చిన్నవాడిని కూడా ఐదేళ్లు రాగానే బడికి పంపుతా. నాలాగా ఇక్కడ ఉన్నవారంతా పిల్లలను బడికి పంపుతున్నారు. జగనన్న మేలు మరువలేమయ్యా.

– కిందం ఇందు, విద్యార్థి తల్లి, ఒప్పిచర్ల

చూడటానికి రెండు కళ్లు చాలడం లేదు..



మా తాత ముత్తాతలు ఎవరూ చదువుకోలేదు. అలాంటిది జగనన్న అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు తల్లులకు ఇస్తుండడంతో బిడ్డలను చదివించుకోవాలనే ఆశ మాకు సైతం కలిగింది. మా అబ్బాయిని బడికి పంపుతున్నాను. మొదట డబ్బు కోసం ఆశపడ్డాం. కాని వారు స్కూలు డ్రెస్సు, బూట్లు వేసుకుని బడికి వెళ్తుంటే చూడడానికి రెండు కళ్లు చాలడం లేదు. ఇంత కంటే ఏం కావాలి. మా అందరికీ జగనన్న అంటే ప్రాణం.

– సుప్తం ముత్యాలు, విద్యార్థి తల్లి, ఒప్పిచర్ల

సిద్ధం సభకు సన్నద్ధం

- గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల ముఖ్యనేతలతో ఎంపీ విజయసాయి రెడ్డి భేటీ
- సభ ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి, వేదికపై నేతలు అంబటి రాంబాబు, కాకాణి, నేదురుమల్లి, బీద మస్తాన్ రావు, చెవిరెడ్డి, బాలినేని, మోపిదేవి, లేళ్ల అప్పిరెడ్డి

ఒంగోలు: ఈనెల 10న మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరణ, సన్నాహక సమావేశం ఒంగోలులో శనివారం నిర్వహించారు. ఒంగోలులోని స్థానిక వీకేబీ రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, గుంటూరు, బాపట్ల జిల్లాల కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, రీజినల్ కో–ఆర్డినేటర్, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. తొలుత ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పరిశీలకులు, సమన్వయకర్తలతో విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు మద్దెల గురుమూర్తి, ఆదాల ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్‌రావు, మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, తలశిల రఘురాం, తూమాటి మాధవరావు, శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్, కుందురు నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబు, మేకపాటి విక్రమ్ రెడ్డి, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ విభాగం ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైనవారిలో వరికూటి, అన్నా రాంబాబు, అంబటి మురళీకృష్ణ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, దేవినేని మల్లిఖార్జునరావు తదితరులు

ప్రశాంతంగా సెకండియర్ పరీక్షలు

- అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ.. 144 సెక్షన్ అమలు
- జిల్లావ్యాప్తంగా 425 మంది ఇంటర్మీడియెట్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు గైర్హాజరు



సత్తెనపల్లిలో ఓ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

సత్తెనపల్లి: జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్షల ప్రారంభమై 12 గంటలతో ముగిశాయి. అధికారులు తీసుకున్న ముందు జాగ్రత్తచర్యల కారణంగా విద్యార్థులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా పరీక్షలు రాశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని అధికారులు ప్రకటించడంతో విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా 8:30 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లాలో 9 ప్రభుత్వ, 69 ప్రైవేట్, 2 ఎయిడెడ్, 6 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 14 మోడల్ పాఠశాలలు, 24 కేజీబీవీ, 3 హైస్కూల్ ప్లస్, ఒక రెసిడెన్షియల్ కళాశాలలకు చెందిన 13,449 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు తెలుగు, సంస్కృతం పరీక్షలు రాయాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా కేటాయించిన 48 పరీక్ష కేంద్రాల్లో 13,024 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 425 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 12,862 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 12,470 మంది హాజరుకాగా 392 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 587 మంది విద్యార్థులకు గాను 554 మంది విద్యార్థులు హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. 2 ఫ్లయింగ్, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు జిల్లా పరీక్షల కమిటీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసింది. జిల్లాలో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లావ్యాప్తంగా 42 మంది దివ్యాంగ విద్యార్థులను వారి వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు చేర్చారు. పల్నాడు జిల్లా డీఐఈఓ నీలావతిదేవి నరసరావుపేటలో పలు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమల్లో భాగంగా బందోబస్తు నిర్వహించారు.

వైఎస్ కుటుంబం జోలికివస్తే ఊరుకోం

- పల్నాడును అభివృద్ధి చేసిన ఘనత మహానేతదే..
- ఆయన విగ్రహాన్ని ధ్వంసం చేయటానికి ప్రయత్నించిన వారికి బుద్ధి చెబుతాం
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ రాస్తారోకో



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్, చలమారెడ్డి తదితరులు

మాచర్ల: పల్నాడును అభివృద్ధి పథంలో నడిపి, ప్రజలకు ఎంతో మేలు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసి అరాచకం సృష్టించాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌లు కుట్రకు పాల్పడుతున్నారని, మహానేత విగ్రహాల జోలికిగానీ, వైఎస్సార్ కుటుంబం జోలికిగానీ వస్తే తమ తడాఖా చూపిస్తామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డిలతో కలిసి శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి ఆశీస్సులతో కొప్పునూరులో గ్రామంలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసే యత్నాన్ని ఖండిస్తూ మాచర్ల బస్టాండ్ ప్రాంతంలో మానవహారంగా ఏర్పడి, నల్ల బ్యాడ్జీలతో భారీస్థాయిలో నిరసన వ్యక్తం చేసి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్లకు ఇన్‌చార్జిగా నియమించి దుర్మార్గమైన చర్యలకు నిలయంగా మార్చారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మరోసారి ఓడిపోవటం ఖాయని తెలుసుకొని నానా యాగీ చేస్తూ దుర్మార్గులను నియోజక వర్గ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తున్నారు. అందులో భాగంగా జూలకంటి బ్రహ్మారెడ్డిని టీడీపీ ఇన్‌ఛార్జిగా నియమించి అరాచకాలకు తెరతీశారన్నారు. ఐదుసార్లు పల్నాడు గడ్డ మాచర్లలో ప్రజల ఆశీస్సులతో వరుసగా గెలుస్తున్న మాపై కుట్రపన్ని రోజూ ఏదోచోట అల్లర్లకు తెరలేపుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో ఏదో విధంగా జనాలను రెచ్చగొట్టడమే పనిగా బ్రహ్మారెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు పల్నాడుకు చేసిన ఒక్క అభివృద్ధి పనైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. కొమ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజక వర్గంలో, మాచర్ల మండలంలో రూ. 150కోట్లతో 10వేల ఎకరాలలో సాగు, తాగునీరందించిన ఘన చరిత్ర మహానేత వైఎస్సార్‌దన్నారు. అదే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెల్దుర్తి మండలంలో మంచినీటి పథకం, రాబోయే రోజుల్లో వరికపూడిసెల పథకం ద్వారా సాగు,తాగునీరు తేనుండడం, సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, ఇవన్నీ ప్రజల్లోకి వెళ్లడంతో సహించలేక దాడులే లక్ష్యంగా ప్రతిపక్షం కుట్ర రాజకీయాలకు తెరలేపిందన్నారు. పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మీ చరిత్రలో ఎప్పుడైనా మాచర్లను అభివృద్ధి చేశారా? అని ప్రశ్నించారు. గొడవలు సృష్టించటానికి పెట్టుబడులు పెడుతూ అల్లర్లు సృష్టించేందుకు నిరంతరం బ్రహ్మారెడ్డి పాటుపడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కుటుంబం జోలికి వస్తే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పోలీసులు విగ్రహాన్ని ధ్వంసానికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత బస్టాండ్ ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సీఎం చంద్రబాబు, బ్రహ్మారెడ్డిల గడ్డి బొమ్మలను దహనం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రిసాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, అబ్దుల్ జలీల్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకుడు మల్లిఖార్జున యాదవ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



చంద్రబాబు, బ్రహ్మారెడ్డి గడ్డి బొమ్మలను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి

- నేడు జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం
- రేపటి నుంచి ఇంటింటికీ వ్యాక్సినేషన్
- జిల్లా వ్యాప్తంగా 1,86,042 మంది ఐదేళ్ల లోపు చిన్నారుల గుర్తింపు



వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న డాక్టర్ బి.గీతాంజలి

సత్తెనపల్లి: జాతీయ ఇమ్యునైజేషన్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 3వ తేదీన ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా వైద్యాధికారులు రంగం సిద్ధం చేశారు. దీనిపై ఇప్పటికే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. 12 ఏళ్ల నుంచి దేశంలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కాలేదు. ఈ నెల 3వ తేదీన పల్స్ పోలి యో చుక్కలు వేయగా .. మిగిలిన పిల్లలకు ఈ నెల 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి చుక్కలు వేస్తారు. జిల్లాలో 1,86,042 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. మొత్తం 10, 770 వెయిల్స్‌ను సిద్ధం చేశారు. 2,15,400 డోసు లను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా 7 ప్రాంతాలలో బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచారు. మొత్తం 70 మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి తెలిపారు.

క్లుప్తంగా

నేడు, రేపు ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు సమావేశాలు

తాడికొండ: ఏపీ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో ఏపీ ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు సమావేశాలు విశ్వ విద్యాలయంలో నిర్వహించనున్నట్లు వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఎస్వీ కోటారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వ విద్యాలయాల్లో వైబ్రెంట్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌ను పెంపొందించడం సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభించనున్నారని, గౌరవ అతిథులుగా ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ సీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం, వీఐటీ వ్యవస్థాపకులు మరియు చాన్సలర్ జి.విశ్వనాథన్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

పౌర హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది ఎన్వీ నరసింహారావు ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ టి.రాజారావు, రాష్ట్ర నాయకులు పి.రాజారావు సమక్షంలో తాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

లక్ష్యాలకు అనుగుణంగా విద్యాభ్యాసం

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- 'పది' విద్యార్థులతో ఏ డే విత్ కలెక్టర్



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు తమ లక్ష్యాలను పాఠశాల విద్యస్థాయిలోనే నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా విద్యాభ్యాసం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో శనివారం సాయంత్రం ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఏ డే విత్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 241 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత వారి వద్ద నుంచి అభిప్రాయాలు, లక్ష్యాలను రాతపూర్వకంగా సేకరించారు. హాజరైన వారిలో 79 మంది సాఫ్ట్‌వేర్, 54 మంది సివిల్స్, 53 మంది డాక్టర్లు, మిగిలిన వారు లాయర్లు, ఉపాధ్యాయులు, ఛార్టర్డ్ అకౌంటెంట్, వ్యాపారం వంటివి తమ లక్ష్యంగా ఎంచుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ శివశంకర్ విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా వాటిని సాధించేందుకు ఎలా సన్నద్ధం కావాలనే అంశాలను వివరించారు. తనకు 8వ తరగతి చదివేటప్పుడే ఐఏఎస్‌పై మక్కువ ఏర్పడిందని, తాను ఎన్నిసార్లు విఫలమైనా చివరకు సాధించానని చెప్పారు. ఎవరైనా తమ అపజయాలను విజయాలకు మెట్టుగా మలచుకొని లక్ష్యాలను సాధించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉపవిద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్, ఎస్ఈసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి మూలస్తంభాలు ఆరోగ్య మిత్రలే

జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్


ఆరోగ్యమిత్రలతో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువచేసి ప్రభుత్వ లక్ష్యాలను సమర్థంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో ఆరోగ్య మిత్రుల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మిత్రాలు ప్రతి పేషెంట్‌కు ఆరోగ్యశ్రీ సేవలందే విధంగా హాస్పిటల్ యాజమాన్యాలతో మాట్లాడి వారికి విశిష్టమైన సేవలు అందించాలని సూచించారు. విధులపై అలసత్వం తగదని హెచ్చరించారు. విధులలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన వద్దకు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యశ్రీ టీంలో పనిచేసే ప్రతి ఒక్కరూ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి స్కీముకు జిల్లాలో మంచిపేరు తీసుకొచ్చేందుకు అందరం కలసి కృషి చేయాలని పేర్కొన్నారు. కాగా పల్నాడు జిల్లా ఆరోగ్య మిత్రల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్‌గా నూతనంగా నియమితులైన చంద్రశేఖర్‌ను పూలమాలవేసి, దుశ్శలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, కార్యదర్శి అప్పారావు, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఆరోగ్య మిత్ర అధ్యక్షుడు సాయిబాబారాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సుధాకర్, వెంకటేశ్వర్లు, శివ నాగేశ్వరరావు, అనిల్ కుమార్, చంద్రాజీపాలెం శ్రీను, రోజా రమణి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే పర్యావరణ పరిరక్షణ

నెదర్లాండ్ దేశస్తురాలు జెస్సీకా లీంగ్


వంకాయలపాడులో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

యడ్లపాడు: ప్రజా చైతన్యంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలుతామని నెదర్లాండ్ దేశస్తురాలు జెస్సీకా లీంగ్ చెప్పారు. మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీలో టీసీ బంగారు భవిష్యత్తు, సెర్ప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నెదర్లాండ్ దేశానికి చెందిన బృందం శనివారం సందర్శించింది. సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ జెస్సీకా లీంగ్(నెదర్లాండ్), ఐడీహెచ్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ వరుణ్ (ఇండియా), ఐటీసీ సంస్థ క్రాప్ ప్రతినిధులు దామోదర్, నారాయణస్వామి సందర్శించారు. ప్రకృతి వరాలైన గాలి, నీరు, భూమి కాపాడుకునేందుకు కాలుష్య నివారణను హబ్ అండ్ స్పోక్ విధానంతో గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్వహణ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ, పట్టణాల్లో వంద శాతం చెత్త సేకరణ, వాటి విభజన, వినియోగ రుసుం వసూలు సమగ్రంగా నిర్వహించాలని హరితరాయబారులకు సూచించారు. తడి,పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, సెర్ప్ సంస్థ సమన్వయకర్త జి. కృష్ణ, సీహెచ్. శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వరూధిని, కార్యదర్శి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు


మాట్లాడుతున్న డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలో ప్రతి పాఠశాల నుంచి తొలి నాలుగు స్థానాలు సాధించిన విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించే దిశగా డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ర్యాంక్ ఎటైన్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శనివారం చేపట్టారు. జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల నియోజకవర్గ కేంద్రాలలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమంలో సబ్జెక్ట్ నిపుణులతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. పట్టణంలోని సింధూ స్కూల్‌లో ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన వేణుగోపాలరావు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించే దిశగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు బి.ఎం.సుభానీ, టి.నగేష్, వెన్యూ కోఆర్డినేటర్ ఆర్.గోవిందరాజులు పాల్గొన్నారు. తొలిరోజు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నిపుణులతో విద్యార్థులకు శిక్షణ ఇప్పించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం


ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. అవగాహన ర్యాలీని శనివారం జెండా ఊపి ప్రారంభించారు. పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,86,042 మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారన్నారు. వారందరికీ పోలియో చుక్కలు వేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1136 కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో పాటు మొబైల్ టీంలు 63, ట్రాన్సిట్ టీంలు 26తో పాటు 4,722 మంది వాక్సినేటర్లు పనిచేస్తారన్నారు. జిల్లాకు 2,15,400 డోసులు పంపిణీ చేశారని, హైరిస్క్ ప్రాంతాలు 292 ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు కలిగి ఉన్న తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, వైద్యసిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ర్యాలీలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై ఆన్‌లైన్ శిక్షణ


స్టేషన్ నుంచి ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొన్న అధికారులు

నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆన్‌లైన్ ద్వారా మూడు నూతన చట్టాలపై ఇచ్చిన శిక్షణలో పల్నాడు జిల్లా అధికారులు పాల్గొన్నారు. తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రం నుంచి గత సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజుల పాటు ప్రతిరోజు రెండు గంటల పాటు 'జూమ్ కాన్ఫరెన్స్' ద్వారా ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. సత్తెనపల్లి, గురజాల, నరసరావుపేట డీఎస్పీలు జీసీ గురునాథబాబు, పల్లపురాజు, వీఎస్ఎన్ వర్మ, దిశ డీఎస్పీ ఎం.సుధాకర్ బాబు పాల్గొన్నారు.